www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 19 మే 2025

5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

నిత్యావసర సరుకులు అందజేత


అందజేస్తున్న మాజీ ఎంపీ చింతా అనురాధ

ప్రజాశక్తి - అల్లవరం

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ నిత్యావసరాలు ఆదివారం అందజేశారు. తూర్పు లంక గ్రామంలో పిడుగు పాటుకు గురై, ఇల్లు పూర్తిగా దగ్ధమైన మంద వీర వెంకట సత్య నారాయణ కుటుంబం సభ్యులను ఆమె పరామర్శించారు. చింతా కృష్ణమూర్తి ఫౌండేషన్ ద్వారా 50 కేజీల బియ్యం, వంట సామగ్రి, నిత్యావసరాలు, కూరగాయలు, దుస్తులను ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇళ్ల శేషారావు, వైస్ ఎంపిపి వర్రే గంగ, జడ్‌పిటిసి సభ్యురాలు కొనుకు గౌతమి, సర్పంచ్‌లు బర్రె సీత రత్నం, రాపాక విజయలక్ష్మి, కడలి గంగాజలం తదితరులు పాల్గొన్నారు.

యాత్రికుల వెతలు విను స్వామీ

- బాలబాలాజీ దేవస్థానంలో సౌకర్యాల లేమి
- దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం ఎప్పటికో!


నవీన ఆలయం ఎదురుగా రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లిలో బాల తిరుపతిగా పేరుగాంచిన శ్రీబాలబాలాజీ దేవస్థానం సౌకర్యాలేమితో కొట్టు మిట్టాడుతోంది. ఫలితంగా యాత్రికులు నానా అవస్థలు పడుతున్నారు. దశాబ్దాల తరబడి అనేక సమస్యలు నేటికీ పరిష్కారానికి నోచుకోలేదు. నిత్యం జిల్లా నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి యాత్రికులు స్వామివారి దర్శనానికి వస్తుంటారు. శని, ఆదివారాలలో, ముఖ్యమైన పర్వదినాలలో వీరి సంఖ్య వేలల్లో ఉంటుంది. పుష్కరాలు సమీపిస్తున్న తరుణంలో లక్షల సంఖ్యలో వచ్చే యాత్రికులను దృష్టిలో పెట్టుకుని మెరుగైన వసతులు కల్పించాలని సర్వత్రా కోరుతున్నారు.

వసతి, కళ్యాణ మండపాలకు పొంచి ఉన్న ముప్పు

సుదూర ప్రాంత యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహాల సముదాయంలో పైఅంతస్తు, భోజన హాలు పైఅంతస్తు కళ్యాణాలు జరిపించుకునే హాలుల్లో స్లాబ్‌లు శిథిలావస్థకు చేరాయి. పెచ్చులుడి ఇనుప ఊచలు బయటకు వస్తున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు యాత్రికులు ఇక్కడే వివిధ కార్యక్రమాలను నిర్వహించుకుంటారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు వసతిగృహంలో విశ్రాంతి తీసుకుంటుంటారు. స్లాబ్ పెచ్చులుడి పడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన వ్యక్తం అవుతోంది.

నూతనంగా నిర్మించే సిసి రోడ్డు ప్రయోజనం ఎంత?

నవీన ఆలయం ప్రధాన రహదారి నుంచి పాత గుడి వరకూ ప్రస్తుతం నిర్మిస్తున్న సిసి రహదారి యాత్రికులకు ఏ మేరకు ప్రయోజనం చేకూరుతుందో అనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 900 మీటర్ల పొడవున ప్రధాన రహదారి నుంచి మలుపు వరకు ఏడు మీటర్ల వెడల్పు, తరువాత నుంచి నాలుగు మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ నాలుగు మీటర్ల వెడల్పు రోడ్డును ఆనుకుని మార్జిన్‌లో సుమారు మూడు మీటర్ల వెడల్పు స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించనున్నారు. ఇదే రోడ్డు నుంచి దత్తత శివాలయానికి చెందిన సుమారు రెండు ఎకరాల ఖాళీ స్థలంలో వాహనాలు పార్కింగ్ ఉంది. కోసం వాహనాలు ఇదే రోడ్డుపై వెళ్ళాల్సి ఉంది. ఇదే రహదారి నుంచి యాత్రికులు పాత గుడికి క్యూ లైన్‌లో వెళ్ళాల్సి ఉంది. రోడ్డు మార్జిన్‌లో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుతో భవిష్యత్తులో మరింత ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. దీంతో రోడ్డు ప్లానింగ్‌పై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

శిథిలావస్థలో స్నాన ఘట్టం

గత పుష్కరాలలో ఆధునికీకరించిన స్నానఘట్టానే నేటికీ వాడుతున్నారు. ఈ ఘాట్‌లో మెట్లు శిథిలమయ్యాయి. గత పుష్కరాల సమయంలో హడావుడిగా ఘాట్ నిర్మాణం జరిగింది. స్నాన ఘట్టం సమీపంలో లోతు ఎక్కువగా ఉండటంతో యాత్రికులు లోపలికి వెళ్లకుండా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ పూర్తిగా దెబ్బతింది. స్నాన ఘట్టం సమీపంలో మహిళలు దుస్తులు మార్చుకునే గదులు, మరుగుదొడ్లు అరకొరగా ఉండడంతో అవస్థలు పడుతున్నారు. కళ్యాణ కట్ట పాత గుడి వద్ద ఉండటంతో తలనీలాలు సమర్పించుకునే యాత్రికులు అవస్థలు పడుతున్నారు. దీన్ని నదీ తీరానికి దగ్గరలో నిర్మించాలనే కార్యాచరణలో నేటికీ కదలిక లేదు. పుష్కరాల నేపథ్యంలో హడావుడిగా కాకుండా ముందుగానే ఈ పనులు పూర్తి చేయాలని, ఆ మేరకు పాలకులు, అధికారులు దృష్టి పెట్టాలని యాత్రికులు కోరుతున్నారు.


నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు


వసతి గృహాల సముదాయం స్లాబ్‌లు పెచ్చులూడి కనిపిస్తున్న ఐరన్

సమస్యలు ఉన్నతాధికారులకు నివేదించాం



బాలబాలాజీ దేవస్థానంలో యాత్రికుల సమస్యలు మీకు తెలియవా..అంటూ ఒక్కొక్కటీ పరిష్కరించేందుకు ఉన్నతాధికారులకు నివేదించాము. శిథిల వసతి భవనాలు తొలగించేందుకు ఉన్నతాధికారులు పరిశీలనకు వస్తారన్నారు. యాత్రికుల విరాళాలతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కార్యాచరణకు సిద్ధమవుతున్నాము. కళ్యాణ కట్టను నదీ తీరానికి చేరువలో నిర్మించేందుకు పరిశీలన చేశామమని 'ప్రజాశక్తి'కి తెలిపారు.

- ఎం.సత్యనారాయణ రాజు, ఇన్‌ఛార్జ్ సహాయ కమిషనర్, బాలబాలాజీ దేవస్థానం

మాడ వీధులు ఎప్పటికో

నవీన ఆలయం చుట్టూ మాడ వీధులు ఏర్పాటు చేయాలనే సంకల్పం కార్యాచరణకు నోచుకోలేదు. తూర్పు వైపు రెండెకరాల స్థలం సేకరించి కళ్యాణ వేదిక ఏర్పాటు ప్రతిపాదనలోనూ కదలిక లేదు. ఏడు శనివారాల ప్రదక్షిణలు చేసే యాత్రికులు పెరగడం, దర్శనం క్యూలైన్ యాత్రికుల రద్దీతో అవస్థ పడుతున్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి


అంబేద్కర్ విగ్రహావిష్కరణలో ఎంఎల్‌ఎ బండారు, ఎంపి హరీష్

ప్రజాశక్తి - కొత్తపేట

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం కొత్తపేటలోని బాబానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని అమలాపురం ఎంపి గంటి హరీష్, పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యంతో కలిసి ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలిచిన ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని అన్నారు. ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచే రాజ్యాంగాన్ని రూపొందించిన ఘనత అంబేద్కర్‌దని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేసి వాటిని సాకారం చేసుకోవడమే అంబేద్కర్‌కు మనమిచ్చే గౌరవం అని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, భాస్కరరావు, కాశి రాజు, అంబేద్కర్ అభిమానులు, యూత్ పాల్గొన్నారు.

150 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - మండపేట

మండపేట బురుగుంటచెరువుపార్కు వద్ద డొక్కా సీతమ్మ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత 150 మందికి బిఎమ్‌డి పరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు కోన సత్యనారాయణ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ బిక్కిన తాతబ్బాయి చౌదరి, డాక్టర్ ఎమ్‌డి హైదర్ (బిపిటి) ఫిజియోథెరపీలో పాల్గొని 150 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎముకల సాంద్రత పరీక్ష అనేదిబలాన్ని నిర్ణయించడానికి ఉపయోగించే ఒక వైద్య ప్రక్రియ. ఇది బోలు ఎముకలు వ్యాధి లేదా భవిష్యత్తులో ఎముకల పగుళ్ల ప్రమాదాన్ని గుర్తించి ఎముకలలోని ఖనిజాల పరిణామాన్ని కొలవడానికి ఎక్స్ కిరణాలను ఉపయోగిస్తుందని అన్నారు. ఈ బోలు ఎముకలు వ్యాధికి గురయ్యే ప్రమాదం ఉన్నవారికి ఈ పరీక్ష చాలా అవసరమన్నారు. 40 సంవత్సరాలు దాటిన మహిళలు, పురుషులు కూడా చేయించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వయసు పెరిగేకొద్దీ కొన్ని ఎముకలు తక్కువ సాంద్రత ను కలిగిస్తాయని, ఎముకలు సాంద్రత కోల్పోయినప్పుడు బోలు ఎముకలు వ్యాధి అభివృద్ధి చెంది ఎముకలు బలహీనంగా మారడానికి కారణమవుతుం దన్నారు. అస్థియో పోరోసిస్ ఎముకలను బలహీనపరు స్తుందన్నారు. దీనివల్ల ఎముక విరిగే అవకాశం ఉంటుందని ప్రతి ఒక్కరూ ఎముకల సాంద్రత తెలిపే పరీక్ష చేయించుకోవాలని డాక్టర్ ఎండి హైదర్ తెలిపారు. కార్యక్రమంలో టెక్నీషియన్ రమేష్, మెడికల్ రిప్రజెంట్ జావిద్ క్లబ్ ప్రధాన కార్యదర్శి అబ్బాస్, ఉపాధ్యక్షులు రెడ్డిరాజు, సిహెచ్.భాస్కరరాజు, గంపల సత్య ప్రసాద్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా మానవ హక్కుల సంఘం అధ్యక్షునిగా శ్రీనివాస్

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రజా మానవ హక్కుల సంఘం ఎపిశాఖ అధ్యక్షునిగా రామచంద్ర పురానికి చెందిన బర్ల శ్రీనివాసులు నియమించినట్లు ప్రజా మానవ హక్కుల సంఘం ఛైర్మన్ పాలడుగు ఉపేంద్ర ఆదివారం తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ కార్యాలయం నుంచి శ్రీనివాస్ నియామక పత్రం విడుదల చేశారు. దీనిపై శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకై తన వంతు బాధ్యత నిర్వహిస్తానని, తనపై నమ్మకంతో ఎపిశాఖ బాధ్యతలు అప్పగించినందుకు బాధ్యతాయుతంగా పనిచేస్తానన్నారు.


వివరాలు తెలుపుతున్న అధ్యక్షుడు సత్తిబాబు

అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్ పనివేళల్లో మార్పు

ప్రజాశక్తి - ఆలమూరు

216ఎ జాతీయ రహదారి పక్కన మడికి వద్ద ఏర్పాటు చేసిన అంతర రాష్ట్ర కూరగాయ మార్కెట్ పనివేళలలో ఈనెల 20 నుంచి మార్పులు చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పాలూరి సత్య నారాయణ(సత్తిబాబు) ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రదేశంలో మార్కెట్ ఏర్పాటు చేసిన దగ్గర నుంచి ప్రతి రోజు రెండు దఫాలుగా క్రయ విక్రయాలు జరుగుతున్నాయన్నారు. ఇక్కడకు వచ్చే రైతుల సౌకర్యార్థం ఉదయం జరిగే మార్కెట్ సమయం వేకువ జామున యథావిధిగా, మధ్యాహ్నం జరిగే మార్కెట్ సమయంలో మార్పు చేస్తూ మధ్యాహ్నం తరువాత 2 గంటల నుంచి మాత్రమే మార్కెట్ నందు క్రయ విక్రయాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం జరిగే మార్కెట్ సమయంతో రైతులకు భోజనానికి అంతరాయం ఏర్పడటంతో ఇబ్బందులు పడుతున్న విషయం కమిటీ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో మార్కెట్ కమిటీ స్పందించి, సభ్యులతో చర్చించి, ఈ నిర్ణయం తీసుకున్నట్లు సత్తిబాబు తెలిపారు. పై విషయాలపై వినియోగదారులు వ్యాపారులు రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి చెల్లబోయిన సింహాచలం, ఉపాధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు, అందే బుజ్జి, నల్ల వీరబాబు, వెంకట రామారావు, కొత్తపల్లి బుజ్జి దొండ పాటి సాయి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పలు చోట్ల తిరంగా ర్యాలీలు


ముమ్మిడివరంలో తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆపరేషన్ సిందూర్‌లో విజయవంతమైన నేపథ్యంలో డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పలుచోట్ల ఆదివారం తిరంగా ర్యాలీలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: పతి పౌరుడు దేశ భద్రత, సైనికుల ధైర్యం, త్యాగాలకు మద్దతుగా నిలవడం భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమని ముమ్మిడివరం మాజీ ఎంఎల్‌ఎ చెల్లి వివేకానంద పేర్కొన్నారు. పహాల్గం ఉగ్ర దాడి అనంతరం ఆపరేషన్ సిందూలో త్రివిధ దళాల సైనికులు చూపిన తెగువకు సంఘీభావంగా ఆదివారం ఎంపిడిఒ కార్యాలయం, నగర పంచాయతీ కార్యాలయాల సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన తిరంగా ర్యాలీని చెల్లి వివేకానంద జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ జాతీయ రహదారి 216 పై పోలీస్ స్టేషన్, బళ్లగేటు సెంటర్ మీదుగా గాంధీ బొమ్మ సెంటర్ వరకూ 'తిరంగా ర్యాలీ' కొనసాగింది. ఈ ర్యాలీనుద్దేశించి ఆయన మాట్లాడుతూ మన దేశ సమగ్రత, సైనికుల శక్తి సామర్థ్యాలు ప్రపంచానికి మరోసారి చాటి చెప్పారని, భారత మాత ముద్దు బిడ్డ సైనికుడు మురళి నాయక్ వీర మరణం బాధాకరం అన్నారు. జోహార్ మురళి నాయక్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో దాట్ల పద్వీరాజు, చెల్లి అశోక్, కౌన్సిలర్ ములపర్తిబాలయిఔష్ణ, నాగిడి నాగేశ్వరావు, గొలకోటి దొరబాబు తాడి నరసింహారావు, నగర పంచాయతీ కమీషనర్ రవి వర్మ, తహాశీల్దార్ ఎంవి. సుబ్బలక్ష్మి, ఎంపిడిఒ తాడి శ్రీ వెంకటాచార్య, మెండి కమల, జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఆలమూరు: మదర్ థెరిసా స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఫౌండర్ గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు ఆధ్వర్యంలో ఆదివారం కొత్తూరు సెంటర్ జంక్షన్ నుండి రైస్ మిల్లుల వరకు టైక్వాండో మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులతో ఇండియా ఆర్మీ సైనికులు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ ఉగ్రవాదులను మట్టికరిపించిన విధానాన్ని విద్యార్థులకు వివరిస్తూ వారికి ఆపరేషన్ సిందూర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా మే 7న ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టింది భారత ఆర్మీ. పాకిస్థాన్ లోని 9 కీలక ఉగ్ర స్థావరాలపై భారత్ మెరుపుదాడులు నిర్వహించిందన్నారు. కేవలం 25 నిమిషాల్లోనే పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని 9 కీలక ప్రాంతాల్లో దాడులు చేసిందన్నారు. భారత్ నిర్వహించిన ఈ దాడుల్లో దాదాపు 100 మంది ఉగ్రవాదులు మృతి చెందినట్లు కేంద్ర రక్షణశాఖ పేర్కొన్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్ లో స్వదేశీయ సాంకేతికతో సత్తా చాటిందన్నారు. భారత మేక్ ఇన్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా పథకాలు ఇందుకు దోహద పడ్డాయన్యానరు. మన డిఫెన్స్ వ్యవస్థ బలోపేతం కావడంతో తెలుగు శాస్త్రవేత్త కృషి దాగి ఉందన్నారు. రాకెట్ మ్యాన్ గా పేర్కొందిన డిఆర్‌డిఒ మాజీ ఛైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి భారత రక్షణ రంగంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. భారతీయులుగా పుట్టి ఇలాంటి విజయోత్సవాలలో పాల్గొనడం మాకు ఆనందం గా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు టి.లక్ష్మీ సందీప్ కిరణ్, ఎం.సత్య కాంత్, ఎం.మోషే, జి.ప్రసాద్, కె.సింహాద్రి, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆలమూరులో టైక్వాండో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న అబ్బులు

రావులపాలెం: పాకిస్థాన్ పై భారత సైన్యం ఆపరేషన్ సింఎజూర్ విజవంతం కావడంతో సైనిక దళాలకు సంఘీభావంగా ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు ఎంపి హరీష్ మాధూర్, కూటమి నాయకులతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఆదివారం రావులపాలెం టిడిపి క్యాంప్ కార్యాలయం నుండి మెయిన్ రోడ్ గుండా నాలుగు రోడ్లజంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి భారత సైన్యం కనబరిచిన అసమాన శౌర్యానికి ప్రతీకగా జై జై ధ్వనులతో నినాదాలు చేసారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పాక్ దాడుల్లో అనేక మంది చనిపోయారని ఉగ్రవాదులు చేపట్టిన దుశ్చర్యలకు యావత్ భారత ప్రజలు రగిలిపోతున్నారన్నారు.దీంతో ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత ప్రభుత్వం ప్రతిఘటన చర్యలు చేపట్టి కొంతమంది ఉగ్రవాదులను హతమార్చడం జరిగిందన్నారు. అలాగే ఎంపి హరీష్ మాధూర్ మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని అణిచివేయటమే లక్ష్యంగా భారత సైనికులు పాక్ కు గట్టిగా సమాధానం ఇచ్చారన్నారు. అనంతరంమాజీ సైనికులను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మండపేట: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో మన సైనిక దళాలకు సంఘీభావంగా ఆదివారం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు నిర్వహించిన తిరంగా యాత్ర ర్యాలీ లో కూటమి శ్రేణులు పాల్గొన్నారు. మాజీ ఎంఎల్‌సి వివిఎస్.చౌదరి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, రాష్ట్ర తెలుగు రైతుకార్యదర్శి రిమ్మలపూడి వేణుగోపాల దొర, రాష్ట్ర తెలుగు యువత సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొప్పిశెట్టి వాసు, తదితరులు పాల్గొన్నారు. మండపేట కలువపువ్వు సెంటర్ నుండి నిర్వహించిన ఈ ర్యాలీలో భారత సైనికులకు జై అంటూ నినాదాలతో హోరెత్తింది.

కార్టూన్'నిజం'



బిజెపి అండతో 'గాలి' అక్రమ మైనింగ్

ఎయిడ్స్ బాధితులకు అండగా ఉంటాం


అమలాపురంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

ప్రజాశక్తి - అమలాపురం

అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమో రియల్ డే -2025 ను పురస్కరించుకొని ఎయిడ్స్ బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని జిల్లా కుష్టు వ్యాధి ఎయిడ్స్, టిబి. నియంత్రణ డాక్టర్ సిహెచ్‌వి.భరత లక్ష్మి భరోసాను ఇచ్చారు. ఆదివారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సెంటర్ నుంచి గడియారపు స్తంభం సెంటర్ వరకు సిబ్బంది ఎన్‌జిఒల సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గడియార స్తంభం సెంటర్ నందు కొవ్వొత్తులు వెలిగించి మానవహారాన్ని నిర్వహించి, హెచ్‌ఐవి ఎయిడ్స్ నిర్మూలన అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు. 'మేము గుర్తించుకుంటాం, మేము మాట్లాడుతాం, మేము నడిపిస్తాం' అనే నినాదంతో ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమో రియల్ డేను నిర్వహించినట్లు భరత లక్ష్మి వెల్లడించారు. హెచ్‌ఐవితో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని, హెచ్‌ఐవితో జీవిస్తున్న వారికి అండగా నిలుస్తామని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ క్యాండి ల్ లైట్ మెమోరియల్ డే - ప్రతీ సంవత్సరం మే నెల మూడో వారంలో జరిపించాలని ఆదేశించిందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలు ప్రకారం, కలెక్టర్, జిల్లా మెడికల్, హెల్త్ ఆఫీసర్ వారి ఆదేశాల మేరకు జిల్లా ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్‌ఐవి, ఎయిడ్స్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవితో మరణించిన వ్యక్తుల వారి కుటుంబాలకు సంఘీ భావం తెలుపుతూ కొవ్వొత్తులను వెలిగించి అంజలి ఘటిస్తూ హెచ్‌ఐవి ఎయిడ్స్‌పై ఉన్న అపోహాలను ప్రజలకు వివరించామన్నారు. ఎయిడ్స్ వల్ల ప్రాణాలు కోల్పోయిన వారిని గౌరవించడానికి, హెచ్‌ఐవి ఎయిడ్స్‌తో జీవిస్తున్న వారికి మద్దతును చూపించడానికి, సోకిన వారి పట్ల ఉన్న కళంకాన్ని తగ్గించడానికి సమాజ అవగాహన కొరకు ర్యాలీని నిర్వహించి ఎయిడ్స్ నివారణ అంశాలపై సమా జంలో అవగాహనను పెంపొందించామన్నారు .ప్రతి ఒక్కరూ విలువైన, సురక్షిత మైన వారనే భావించే సమాజాన్ని నిర్మించడానికి అందరం అంకితభావంతో ఉన్నామని, ఎయిడ్స్‌పై విజయం సాధించే ప్రపంచం కోసం కృషి చేయడం కొనసాగించడానికి కాంతి ప్రకాశం మనకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. వివక్షను ఎదుర్కోవడానికి ఉద్దేశించిన కార్యక్రమమని అన్నారు. హెచ్‌ఐవి బాధితులకు వారి కుటుంభాలకు అండగా ఉంటామని ఆమె అన్నారు. కార్యక్రమంలో జిల్లా సూపర్‌వైజర్ ఎ.బుజ్జి బాబు, ఎఆర్‌టి వైద్యాధికారులు సిబ్బంది, కోస్టల్ పాజిటివ్ పీపుల్ సిబ్బంది, ఐసిటిసి, డిఎస్‌ఆర్‌సి సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, జన కళ్యాణి వెల్ఫేర్ సొసైటీ సిబ్బంది, జిల్లా టిబి సిబ్బంది, జిల్లా ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్‌ఐవి/ ఎయిడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్లో గోదావరి భవన్ నందు ఈ నెల 19న సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు 1100 కాల్ సెంటర్ ద్వారా తమ ఫిర్యాదుల పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చునన్నారు. ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే అడగవచ్చునన్నారు. కొత్త ఫిర్యాదులు కూడా నమోదు చేయవచ్చునన్నారు. అర్జీదారుల వద్ద నుంచి వినతులను స్వీకరించి వారి సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదిక యందు నమోదు చేస్తూ వారి సమస్యలకు పరిష్కారం తెలుపబడునని, ప్రజా సౌకర్యార్థం ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక మూడు డివిజన్, 22 మండల కేంద్రాలు, నాలుగు మున్సిపల్ కార్యాలయాలలోనిర్వహిస్తారన్నారు. అర్జీదారులు ఆయా స్థాయిలలో తమ సమ స్యలను నమోదు చేసుకొని పరిష్కారం పొందు దిశగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

- మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించిన ఎంఎల్ఎ బండారు సత్యానందరావు


మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభ కార్యక్రమంలో ఎంఎల్ఎ సత్యానందరావు

ప్రజాశక్తి - రావులపాలెం

కొత్తగా ఏర్పాటైన ఎస్ఎల్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలోని వెదిరేశ్వరపురం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎల్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని ఆయన ఆదివారంప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయడం శుభపరిణామమని అన్నారు. ఈ ఆసుపత్రి ద్వారా రోగులకు మరిన్ని సేవలు అందించి పేరుప్రఖ్యాతులు చూరగొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు బండారు శ్రీనివాస్, మాజీ డిసియంఎస్ ఛైర్మన్ కెవి.సత్యనారాయణ రెడ్డి, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కేతా శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల పట్టాభిరామారావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


ఆధారాలను సేకరిస్తున్న పోలీసులు

శంఖవరం హైస్కూల్లో ఎలక్ట్రానిక్ వస్తువుల చోరీ

ప్రజాశక్తి-శంఖవరం

శంఖవరం జెడ్పి హైస్కూల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు చోరీకి గురైనట్లు మండల విద్యాశాఖ అధికారి వెంకటరమణ అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి సమయంలో స్థానిక జెడ్పి హైస్కూల్లో గుర్తు తెలియని దుండగులు ఆఫీస్ రూమ్ తలుపులు పగలగొట్టి సుమారు రూ.3 లక్షల విలువ చేసే కంప్యూటర్లు, ప్రింటర్లను అపహరించారు. స్కూలు ఉపాధ్యాయుల ఫిర్యాదుతో పోలీసులు క్లూస్ టీమ్‌తో ఆధారాలను సేకరించి దర్యాప్తు ప్రారంభించారు

భార్యపై భర్త దాడి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు గ్రామంలో భార్యపై భర్త దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేబ్రోలు పాత బ్యాంకు వీధిలో కిలారి శ్రీను, జ్యోతి దంపతులు నివాసముంటున్నారు. శ్రీను మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడంతో జ్యోతి మామ అప్పలకొండ తనకున్న ఎకరంన్నర పొలం జ్యోతి కుమారుడు శివరాం పేరుమీద రాశాడు. దీంతో ఆగ్రహించిన శ్రీను రోజూ భార్యను వేధించడం మొదలుపెట్టాడు. శనివారం శ్రీను మద్యం సేవించి భార్యను డబ్బులు అడగగా లేవని చెప్పడంతో ఆగ్రహించి ఆమెపై కత్తితో దాడి చేశాడు. దీంతో ఎడమ చేతికి గాయం అయ్యింది. తోటి కోడలు రమణమ్మ పిఠాపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా ఆమె చికిత్స పొందుతున్నారు. జ్యోతి ఫిర్యాదుపై ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాడుతున్న నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేయగా నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..మండలంలోని ఠానేలంక గ్రామంలో పేకాడుతున్న సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఒక ఇంట్లో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జ్వాలసాగర్ తెలిపారు.

బాలికపై వృద్ధుని అత్యాచారం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మానసిక స్థితి సరిగ్గా లేనిబాలికపై వృద్ధుడు అత్యాచారం చేసి గర్భిణిని చేసిన సంఘటన వెలుగు చూసింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని అయినాపురం పంచాయతీకి చెందిన ముడే బాలయోగి అదే గ్రామానికి చెందిన మానసిక స్థితి సరిగ్గా లేని బాలికకు మాయ మాటలు చెప్పి అత్యాచారం చేసి గర్భిణిని చేశాడు. ఆ బాలిక గర్భం ధరించడంతో ఆమెను కాకినాడ జిజిహెచ్‌కు తరలించి అబార్షన్ చేయించేందుకు ప్రయత్నించగా, ఆసుపత్రి సిబ్బంది నుంచి పోలీసులకు ఆదివారం సమాచారం రావడంతో కాకినాడ వెళ్లి ఆ వద్ధుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దీనిపై అమలాపురం డిఎస్‌పి టిఎస్‌కె.ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఐ డి.జ్వాల సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తణుకు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కపిలేశ్వరపురానికి చెందిన మట్టపర్తి ఆదియ్య(40) మృతి చెందాడు. ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు జాతీయ రహదారిపై కమ్మ కల్యాణ మండపం సమీపంలో తాడేపల్లిగూడెం నుంచి తణుకు వైపు మోటారు సైకిల్‌పై ఆదియ్య వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆదియ్య తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.


శనివారం రాత్రి దహనమైన ఆటో

ఆటో దహనంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఆటో కు నిప్పు పెట్టి దహనం చేశారని ఆదివారపుపేట గ్రామానికి తోట వెంకటేష్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని ఆదివారపు పేటలో శనివారం రాత్రి 12 గంటల సమయంలో ఆటోను పార్క్ చేసి నిద్రిస్తున్న సమయంలో కపిలేశ్వరపురం మండలం పల్లపు లంక గ్రామానికి కాశి అశోక్ అలియాస్ బాబి అనే వ్యక్తి తన అనుచరులతో వచ్చి పెట్రోల్ పోసి ఆటో దహనం చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు జీవనాధారమైన ఆటో దగ్ధం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ద్రాక్షారామ పోలీస్ లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ముఖాముఖి

ప్రజాశక్తితో జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి నాగరాజు



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న గ్రంథాల యాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, పాఠకుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని, వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందజేస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.నాగరాజు అన్నారు. అన్ని గ్రంథాలయాల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించి, శిథిలావస్థకు చేరిన భవనాలను మరమ్మత్తులు చేసి అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. ఇంకా పలు అంశాలను ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ఏ చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో 102 ప్రభుత్వ గ్రంథాలయాలు ఉన్నాయి. వీటిలో గ్రేడ్ 1 శాఖ గ్రంథాలయాలు 5, గ్రేడ్ 2 శాఖా గ్రంథాలయాలు 10, గ్రేడ్ 3 గ్రంథాలయాలు 86 ఉన్నాయి. గ్రామీణ గ్రంథాలయాలు 56కి 5 మాత్రమే పని చేస్తున్నాయి. పుస్తక నిక్షిప్త కేంద్రాలు 161, మొబైల్లో లైబ్రరీలు 5 ఉండేవి. అయితే సిబ్బంది కొరత వలన అవి మూతపడ్డాయి. వీటిలో 57 లైబ్రరీలకు సొంత భవనాలుండగా,10 అద్దె భవనాల్లోనూ, మిగిలినవి ఉచితంగా ఏర్పాటు చేసిన భవనాల్లోనూ నడుస్తున్నాయి. వీటిలో ఎప్పటికప్పుడు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి గ్రంథాలయంలోనూ స్టడీ ల్యాబ్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా కేంద్రంలోని కాకినాడలో ఏర్పాటు చేయగా తరువాత దశలో అన్ని మున్సిపల్ కేంద్రాల్లోనూ వీటిని ఏర్పాటు చేస్తాం.

సంస్థలో సిబ్బంది కొరత ఉందా..

జిల్లా కార్యాలయంలో మొత్తం 204 మంది సిబ్బందికి గానూ 62 మంది రెగ్యులర్, 34 మంది ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నారు. ఇంకా 141 మంది సిబ్బంది అవసరం ఉంది. సిబ్బంది కొరత వల్ల ఉన్న వారిపైనే అధిక భారం పడుతుంది. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. త్వరలో కొంత మంది సిబ్బందిని భర్తీ చేసే అవకాశం ఉంది.

పుస్తకాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయా.

జిల్లాలో ఉన్న అన్ని గ్రంథాలయాలల్లో ప్రస్తుతం సుమారు 14.55 లక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఒక లక్షా 52 వేల 545 మంది సభ్యులు ఉన్నారు. ఒక లక్ష మంది సెక్యూరిటీ డిపాజిట్ చేశారు. గ్రేడ్-1 గ్రంథాలయాలకు రోజుకి 200 మంది, గ్రేడ్-2 గ్రంథాలయాలకు 150 మంది, గ్రేడ్-3 గ్రంథాలయాలకు 100 మంది పాఠకులు హాజరవుతున్నారు. వీరిలో 25 శాతం మంది కాంపిటీటీవ్ పరీక్షల కోసం వస్తున్నారు. డిమాండ్ ఆధారంగా నిధుల లభ్యతను బట్టి పరిపాలనా ఆమోదం ద్వారా పుస్తకాలను కొనుగోలు చేస్తున్నాం. వీటి కొనుగోలుకు సంవత్సరానికి సుమారు రూ.50 లక్షల బడ్జెట్ కేటాయింపులు జరుగుతున్నాయి.

సెస్ బకాయిలపై దృష్టి సారించారా..

జిల్లాలో అన్ని గ్రంథాలయాల పరిధిలో దాదాపు రూ.33 కోట్లు సెస్ బకాయులు పెండింగ్‌లో ఉన్నాయి. కాకినాడ, రాజమహేంద్రవరం నగర పాలక సంస్థల్లో సుమారు రూ.22 కోట్లు, మిగిలిన ప్రాంతాల్లో రూ.10 కోట్ల పైనే బకాయిలు ఉన్నాయి. త్వరలోనే బకాయిలు వసూళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

శిథిలావస్థకు చేరిన గ్రంథాలయాల పరిస్థితి ఏమిటి..

జిల్లాలో ఉన్న 57 సొంత భవనాలల్లో కొన్ని శిథిలావస్థకు చేరాయి. వీటిలో ఎక్కువ శాతం 50 ఏళ్ల దాటినవే ఉన్నాయి. ప్రతి సంవత్సరం సెస్ వసూలు ద్వారా సుమారు కోటిన్నర ఆదాయం వస్తోంది. శిథిలావస్థకు చేరిన భవనాలను ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి త్వరలోనే నిధులు విడుదల అయ్యే అవకాశం ఉంది. వాటి స్థానంలో కొత్త భవనాల నిర్మాణాలను చేపడతాం.

నూతన భవనాలు నిర్మిస్తున్నారా..

జిల్లాలో 10 ప్రాంతాల్లో నూతన గ్రంథాలయాల నిర్మాణం కోసం స్థల సేకరణ చేశాము. అయితే ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తున్నాం.

పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయా..

ప్రతి గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాము. ప్రభుత్వం ఏదైనా నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే సంబంధిత కాంపిటేటీవ్ మెటీరియల్‌ను కొనుగోలు చేసి ఉంచుతున్నాం. వీటి వల్ల అనేకమంది నిరుద్యోగులకు చాలా ఉపయోగం కలుగుతుంది. జనరల్ పుస్తకాల కొనుగోలుకు ప్రభుత్వం నుండి అనుమతి రావాల్సి ఉంది. అన్ని గ్రంథాలయాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పిస్తున్నాము.

వికలాంగులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

మండలంలోని శంకరాపురంలో ఉన్న హృదయాలయానికి ఎన్ఆర్ఐ కొలుకులూరి సందీప్, జానకి దంపతులు నిత్యావసర వస్తువులను ఆదివారం అందించారు. వారి కుమార్తె అనికా పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోటరీ సెంట్రల్ క్లబ్ అధ్యక్షులు కొండేపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో వీటిని అందించారు. అనంతరం లింగంపల్లి రోటరీ సెంట్రల్ వృద్ధాశ్రమంలో నడవలేని స్థితిలో ఉన్న సీతారత్నంకు ఫిజియోథెరపీ నిమిత్తం రూ.4వేలను నిర్వాహకులు బివివి.ప్రసాద్‌కి అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ జివిఎన్.కృష్ణారావు, రొటేరియన్స్ బూరుగుపల్లి సత్యనారాయణ, బిఎన్‌వి.ప్రసాద్, డి.ప్రభాకర్, జివివి.సత్య నారాయణ, ఆరిఫ్‌ఖాన్, సేవా సంస్థ ఇన్‌ఛార్జి బలగం విశాలక్ష్మి పాల్గొన్నారు.


నిత్యావసరాలు అందజేస్తున్న సందీప్

జవహర్‌ను కలిసిన ఎపిటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఎస్‌సి కమిషన్ చైర్మన్‌గా నియమితులైన ఎపిటిఎఫ్ మాజీ అధ్యక్షులు, మాజీ మంత్రి కెఎస్.జవహర్‌ను ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ అధ్యక్షులు దున్నా దుర్గారావు మాట్లాడుతూ ఎపిటిఎఫ్‌లో అలవడిన క్రమశిక్షణతో జవహర్ ఈ స్థాయికి చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సువర్ణరాజు మాట్లాడుతూ జవహర్ వేసే ప్రతి అడుగులో ఎపిటిఎఫ్ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సాల్మన్ రాజు, రాష్ట్ర కౌన్సిలర్ సలీం, సీనియర్ నాయకులు జానీ, మాస్టర్ విష్ణు, వెంకటరావు, అనిత జ్యోతి, వెంకటలక్ష్మి, కరుణ, జిల్లా కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


జవహర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

సంక్షేమ పథకాల అమలే లక్ష్యం

ప్రజాశక్తి - రామచంద్రపురం

సంక్షేమ పథకాల అమలు చేయడమే టిడిపి ఆ పార్టీరాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో పార్టీ నాయకులు వాసంశెట్టి సత్యం అధ్యక్షతన మహానాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ పరిశీలకులు గన్ని కష్ణ, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు గోపాలబాబు, చింతపల్లి వీరభద్రరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ సిఎం ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ ఆశయాలతో టిడిపి ముందుకు సాగుతోందన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం కషి చేసే ఏకైక పార్టీ టిడిపి అని, ఎన్‌టిఆర్ జయంతిని పురస్కరించుకొని మే 27, 28, 29 తేదీలలో రాష్ట్ర మహానాడు నిర్వహించడం, నియోజకవర్గ జిల్లాస్థాయిలో మహానాడు నిర్వహించడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పేద వర్గాలకు పింఛన్ అమలు, కిలో రూ.2కే బియ్యం వంటి సంక్షేమ పథకాలు అమలు చేసిన పార్టీ టిడిపి అని, 45 సంవత్సరాల సుదీర్ఘకాలంలో ఎన్ని ఆటుపోట్లు ఎదుర్కొన్న పార్టీ అని పేర్కొన్నారు. ఈ నెల 22 పార్లమెంట్ మహానాడు అమలాపురంలో నిర్వహిస్తామన్నారు. రానున్న ఆగస్టు నాటికి హామీలన్నీ అమలు చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అమలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు కడియాల రాఘవన్ మాజీ సిఎం ఎన్‌టిఆర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలని, పలు తీర్మానాలు ప్రవేశపెట్టి సభ్యులచే ఆమోదింప చేశారు. ఈ కార్యక్రమంలో గరికపాటి సూర్య నారాయణ, కంచుమర్తి బాబురావు, అక్కల రిశ్వంత్ రాయ్, నెక్కింటి బాలకృష్ణ, మేడిశెట్టి సూర్యనారాయణ, గుత్తుల బుల్లి రాజు, సలాది పట్టాభి రామయ్య, పెంకే సాంబశివరావు, కొత్తపల్లి శ్రీను, జాస్తి విజయలక్ష్మి, చిన్ని కష్ణ, పేపకాయల నారాయణరావు, మేడిశెట్టి రవికుమార్, రాయపు రెడ్డి బాబు, టిడిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ

కెనాల్ రోడ్డులో ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి- సామర్లకోట

ఈ నెల 21 నుండి 24 వరకు భారత మాల రహదారుల పథకంలో పనులు భాగంగా ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. ఈ రోడ్డు వైపు వెళ్లే వాహనాలను ముత్యాలమ్మ రాయవద్ద నుంచి సామర్లకోట-అచ్చంపేట ఎడిబి రోడ్డు మార్గంలోకి మళ్లిస్తున్నారు. భారత మాల రహదారుల పథకంలో భాగంగా స్థానిక రాక్ సిరామిక్ పరిశ్రమ నుండి పోర్టు వరకు నిర్మిస్తున్న బైపాస్ రహదారుల వంతెనలకు సంబంధించి స్తంభాలపై భారీ గడ్డర్లను ఏర్పాటు చేయాల్సి రావడంతో ఈ ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు.


ముత్యాలమ్మ రాయి సమీపంలో వంతెనకు ఏర్పాటు చేస్తున్న భారీ గడ్డరులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక జవహర్లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ 2003-04 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలిసి తమ ఆత్మీయతను పంచుకున్నారు. 22 ఏళ్ళ తర్వాత కలిసిన వారు తాము చదువుకున్న నాటి ముచ్చట్లను నెమరు వేసుకున్నారు. నాడు తమకు చదువు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. తాము చదివిన స్కూలు అభివద్ధికి తమ వంతు కషి చేస్తామని ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చావలి రామారావు, ఎవిఎస్ఆర్‌కెఎస్.ప్రసాద్, జివిఎస్ఆర్‌కె.మూర్తి, కె.హేమలత, కె.శ్రీదేవి, ఎన్.నూకరాజు, జివివి.సత్యనారాయణ, జిఎస్ఎల్.కుమారి, మేరీ, విద్యార్థులు సురేంద్ర, స్వర్ణకమల, గంగా, కుమారి, గణేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై ఇవ్వాలి

ప్రజాశక్తి - చాగల్లు

వర్షాలు పడుతున్న నేపథ్యంలో పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. గతంలో వరి చేలు కోసిన తర్వాత పొలాల్లో మట్టి నమూనాలు సేకరించే వారని, కాని ఈ సారి ఇలాంటివేమీ నిర్వహించట్లేదని రైతులు తెలిపారు. రీ సర్వే పేరుతో కాలం వెళ్లదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలని కోరుతున్నారు.

మృతుల కుటుంబాలకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - మండపేట, కపిలేశ్వరపురం

మండపేట పట్టణం, కపిలేశ్వరపురం మండలంలో ఇటీవల మరణించిన పలువురు కుటుంబ సభ్యులను ఆదివారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన మండపేట పట్టణం 11వ వార్డులో బెందల శ్రీనివాసు, అమజాల రాముడు కుటుంబ సభ్యులను, కపిలేశ్వరపురం మండలం, వల్లూరు గ్రామంలో వల్లూరి కృష్ణమూర్తి, కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ వేగుళ్ళ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు . ఈ పరామర్శలలో ఎంఎల్ఎ వెంట పట్టణ టిడిపి అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, వల్లూరి వీరబాబు, వల్లూరి చిన్నబ్బు, కొవ్వాడ అప్పన్నబాబు, కొల్లాటి ప్రసాద్, పిట్టా నాని, యగ్గాడ సతీష్, సురేష్, మండపాటి శ్రీనివాస్, తదితరులు, ఉన్నారు.


వల్లూరులో కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో ఆదివారం ప్రజానాట్యమండలి నాయకులు దారపు రెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు పచ్చదనం పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యం వంటి వాటికి సంబంధించి పాటలు పాడుతూ, విద్యార్థులతో పాడిస్తూ అవగాహన కల్పించారు. తెప్పల యోగేష్, లోకేష్ కరాటే, వ్యాయామంలో శిక్షణ ఇచ్చారు. నీలపాల కృష్ణ విద్యార్థులకు కర్ర సాములో ప్రాథమిక అంశాలు, మెలకువలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా చల్లా దొరయ్య చౌదరి, చావలి వెంకటనారాయణ రావు వర్ధంతి సందర్భంగా దూర్వాసుల అనురాధ విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు గుడ్లు, అంబలి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రొంగల అరుణ్ కుమార్, అమృత, నమ్రత, సాయి, మణికంఠ, రేణుక, నేహా, లలిత, లావణ్య, నాని, శ్రావణ్, మనోజ్, సందీప్, హర్ష, అంజలి, అనూష, అంజుషా తదితరులు పాల్గొన్నారు.


పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న కృష్ణ

బాధ్యత కలిగిన ఉపాధ్యాయులే కావాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

బాధ్యతాయుతంగా విద్యా బోధన చేసే ఉపాధ్యాయులు మాత్రమే తమ స్కూల్‌కు రావాలని రాయభూపాలపట్నం ప్రజలు ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ మన్యం చిన్న ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద ఈ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా చిన్న మాట్లాడుతూ తమ గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్, ఎంపిపి స్కూల్ మెయిన్, ఎస్‌సి పేటలో ఎంపిపి స్కూల్ ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీలు జరుగుతున్నందున తమ గ్రామంలోని పాఠశాలలకు బోధనపై ఆసక్తి ఉండి విద్యార్థుల చదువు సంధ్యలపై నిత్యం తల్లిదండ్రులతో చర్చించే ఉపాధ్యాయులు మాత్రమే తమ పాఠశాలలకు రావాలన్నారు. తమ గ్రామంలోని మూడు పాఠశాలలకు పూర్వ విద్యార్థులతో పాటు గ్రామస్తులు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. తమ స్కూల్స్ కోరుకుంటే ఎలా గోలాగా నెట్టుకుపోవచ్చని భావించేవారు తమ గ్రామ పాఠశాలలకు రావద్దని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో మన్యం శ్రీను, నల్లల త్రినాథ్, ప్రత్తిపాటి ప్రసాద్, ధనుష్, ఎర్రా భవాని, మేడిశెట్టి వెంకటలక్ష్మి, సమ్మంగి సుబ్బలక్ష్మి, ఎం.గౌరమ్మ పాల్గొన్నారు.

క్రీడల ద్వారా యువతకు మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

క్రీడల ద్వారా యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రత్తిపాడు ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణంలో బదిరెడ్డి గోపి యువసేన నిర్వహిస్తున్న రాజా మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ క్రీడాకారులకు విద్యా ఉద్యోగాలలో ప్రత్యేక కోట రిజర్వేషన్లు ఉంటాయన్నారు. తన భర్త వరుపుల రాజాకు క్రీడలు అంటే మక్కువ ఎక్కువగా ఉండేన్నారు. ఆయన క్రీడాకారులను ప్రోత్సహించడమే కాక అనేక విధాల సహాయ సహకారాలు అందించే వారని ఆమె పేర్కొన్నారు. బొద్దిరెడ్డి గోపి మాట్లాడుతూ విద్యార్థులకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.15 వేలతో పాటు, షీల్డ్‌లు విశేష ప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేక బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, మాజీ జెడ్పిటిసి జ్యోతుల పెదబాబు, కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, ఎండగుంటి నాగబాబు, పెంద్ర శ్రీను, కోణాల వెంకట రమణ నాయకులు ఎస్ జి వి సుబ్బరాజు, రుచి రమేష్, చిక్కాల లక్ష్మణరావు, చందువోలు రాజా పాల్గొన్నారు.


క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-కాజులూరు

మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని గొల్లపాలెం ఎస్‌క్ష్మి ఎం.మోహన్ కుమార్ అన్నారు. మండలంలోని కోలంక శివారులో ఎస్‌క్ష్మి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి, పలు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనదారులను ఉద్దేశించి ఎస్ఐ మోహన్ కుమార్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇటీవల కాలంలో అనేక చోరీలు జరుగుతున్నాయని చోరీలు చేసేవారు రికార్డులు లేని వాహనాలు నడిపి చోరీలకు పాల్పడుతున్నారు. వాహనదారులు రికార్డులు ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారం దగ్గర ఉంచుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో మూడు కేసులను రిజిస్టర్ చేసినట్టు తెలిపారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ శ్రీనివాస ప్రాంగణంలో యాత్రికులకు సౌకర్యార్థం నిర్మిస్తున్న శ్రీ వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి దాతలు విరాళాలు ఆదివారం అందజేశారు. ఉండి మండలం మహదేవపట్నం గ్రామానికి చెందిన పి.సూర్య నిఖిల్, హేమలత లక్ష్మి పావని దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ. 2 లక్షల 116 ఆలయ డిసి నల్లం సూర్య చక్రధర్ రావు అందజేశారు. వీరికి స్వామివరి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

వెంకన్న సన్నిధిలో సమగ్ర శిక్ష కెజిబివి కార్యదర్శి

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామిని ఆదివారం సమగ్ర శిక్ష కెజిబివి కార్యదర్శి, డైరెక్టర్ డి దేవానంద రెడ్డి సతీసమేతంగా స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట డిఇఒ షేక్ సలీం బాషా, మండల విద్యాశాఖ అధికారి పివి .ప్రసాదరావు, ఉపాధ్యాయులు సరిదే ప్రసాద్, చిప్పాడ సత్యనారాయణ, సిఆర్‌ఎంటి వై.జాన్ బాబు ఉన్నారు.

చిన్నారులకు పోషకాహార కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - అమలాపురం

జన కళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వంటెద్దు వెంకయ్య నాయు డు, రిశ్విక్, జల్లి సుజాత సౌజన్యంతో హెచ్ఐవి బాధిత చిన్నారు లకు పోషకాహార కిట్ల పంపిణీ చేశారు. వంటెద్దు వెంకయ్య నాయుడు కార్యాలయంలో ఆదివారం బాధిత చిన్నారులకు ఈ పోషకాహార కిట్లను అంద చేశారు. ఈ కార్ర్యమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు సప్పా నాగేశ్వ రావు, పచ్చిగోళ్ళ సుధ, కల్వకొలను ఉమ, జన కళ్యాణ్ శ్రీనివాస్, తిక్కా బాబి, అత్తిలి గణేష్, గొల్లపల్లి బాబి, యర్రంశెట్టి ప్రసాద్, అడపా తేజ, వికలాంగుల సంఘ అధ్యక్షులు ఎన్.పరశురాముడు, బొంతు శ్రీను, జనకళ్యాణ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.